# పులిస్త్రాకులు

బాలకిట్టయ్యగారింటో బాలకిట్టయ్య కూతురు పెళ్ళి అయితుండది గనక, భోజనాలకి వూళ్ళో రావల్చిన జనం రేత్తిరి పదిగెంటలకి రవిలు పెట్టెలకు మల్లే తోసుకుంటా, ఆ గ్యాసులైటు ఎల్తుర్లో తలుక్ తలుక్కుమంటా, రంగులు కురిపిత్తా, సోల్పున లోనకు జేర్తుండారు సల్లగా పెల్లోరిల్లు గబ్బు లెగుపుతా.

కాత్తెపెడగా యాపసెట్టుకింద గోడకాడ సీకట్లో, ఆయాల్దాకా లోన పెల్లి వంటకాల గాలి బీలుత్తా వూగులాడ్తా కూకునుండ యానాది ఎర్రాయి, ఎర్రాయి సెల్లెలు ఎంకటాం, బామ్మరిది ఎంకాయి, భోజనాల జనం రాటం సూసి, సగం వాలుండ మడుసులు లెగిసి నిటారుగా కూకుండారు మల్లీ, ఎర్రగుడ్లను గురిబెట్టి నిలుపుతా.

"బాలకిట్టయ్య గోరే వన్నాడూ?" అన్నాడు ఎర్రాయి.

"గేటుకాడి కొత్తే కాళ్ళిరగేత్తానన్నాడు" అంది ఎంకటాం.

"నే వుండానా ఆడా?" అన్నాడు ఎర్రాయి.

"ఎనికీడ్తే వుంటివే!" అంది ఎంకటాం.

"పానీలే!" అన్నాడు ఎర్రాయి.

"అయితే యిది వుప్పుడ యిద్దంటా?" అనడిగాడు బామ్మరిది ఎంకాయి.

"ఇదేందీది?" అనంది ఎంకటాం.

"నూ గాదులే ఎర్రాయి నడుగుతుంటే" అన్నాడు ఎంకాయి.

"ఇదేందీట" అనడిగాడు ఎర్రాయి, సమాదిలో నుంచి లెగిసినోడికిమల్లే.

"యీరిప్పు డొచ్చారుగందా! తింటం అయ్యేతలికి ఎంతలెక్కయిద్దంటా?" మల్లీ సెప్పాడు ఎంకాయి.

"బెమ్మకు తెలవాల" అన్నాడు ఎర్రాయి, ఇశారంగా.

"అంతే నంటా!" కాత్తె ఎనక్కి తగ్గాడు ఎంకాయి.

"ఇత్తరాకు ఏసిన కాణ్ణుంచి వుపాచన తాగేయాలకు గెంటయిద్ది" అంది ఎంకటాం.

"వుపాచ నేందే ఎంకటాం?" అ నడిగాడు ఎంకాయి.

"నీకు తెలవదెట్టా. అదేందో నీలంట! కూడు తినబొయ్యే ముంగల ఏలుముడిసి తాగుతారు" అంది ఎంకటాం.

"నీకు చిసలగా దెల్చంటా?" అనడిగాడు ఎంకాయి.

"చరేలే! వోపాలి యిటనే బామ్మలింటో పెల్లయితే, కూడుకెల్లిన జనం, గెంట లెక్కయినా బెయిటకి రాకుంటేనీ, ఏందబ్బా యిదీ అనుకుంటా తడిక మూలకెల్లి చందుకుండా సూశా. ఆడకి దెగ్గిర్లో కూకునుండ నో ముసలి బాపనాయిన పక్కనే నిదరబోతుండ పిల్లోణ్ణి 'లేవరా వుపాచన కానిత్తుండారూ' అనంటున్నాడు. ఆ నీలుతాగారూ, ఇగ తింటం మొదులుబెట్టారు" అనంది ఎంకటాం.

"పానం దీశావే! వుపాచం తాగే యాలకి గెంట లెక్కయితే, ఇంక తింటం మొదలు పెడ్తే ఏయాల కయిద్దీ?" జారుగా అన్నాడు ఎంకాయి.

"సిత్రం ఏందంటే, ఆనక యిత్తరాకుల్లో అయ్యన్నీ అట్ట ఏసుంటయి గందా, వుపాచన లాగేదాకా ఆట్ని సూత్తా బిగదీసు క్కూకోటం కట్టవంటావా కాదంటావా? అట్ట నూ కూకుంటావంట్రా ఎంకాయ్?" అ నడిగింది ఎంకటాం.

"ఎవురు, నేనా? ఆ, అట్టనే కూకుంటా. సమచ్చరా ల్చమచ్చరాలు కూకోమంటే కూకునేదే! అచలు ఆవజాన ఆట్ని సూత్తా కూకుంటేనే బవుముచ్చట గుండదంటే ఎంకటాం!" అన్నాడు ఎంకాయి సొంగ కారుత్తా.

"అట్ట నేవుండలేనయ్యా సెప్పొద్దూ అట్ట యిత్తరాకుల్లో బూరిముక్క పడ్డదంటే, అటిటుసూసి గబిక్కిన నోట్లో ఏసుకుని కల్లుమూసుకోనూ, ఇ హి హి హీ!" నవ్వాగలా ఎంకటామకు.

"నే అయితేనా, పొప్పుసుద్ద నోట్లోకీ, బూరిముక్క బోడ్లోకి యిహ్హి యిహ్హి యిహ్హి!" అంటా తనూ జోడు కలిపాడు ఎంకాయి.

"లోన యాడా వుపాచన యినిపియటంలా!" అయాల్దాకా కైలాసానికి పోయినాడికమల్లే కూకునుండ ఎర్రాయి, తబిక్కిన ఆమాటన్నాడు.

"ఆ?" అన్నాడు ఎంకాయి.

"వుపాచనా?" అంది ఎంకటాం.

"గెంటయింది. లోనెవురూ కూడుదింటం అగుపియదు" అన్నాడు ఎర్రాయి సన్నగా.

"ఇంత పొద్దుబోతే జనానికి కాకెక్కి మొత్తం నాకిపారేత్తే, గోడ యీతలికి

వుత్తపులిత్రాకు లొత్తయ్యేవోఁ!" అంటా గుటకేశాడు ఎంకాయి.

"యాడన్నా తడికుందేవోఁ సూసిరానెట్టా?" అంది ఎంకటాం.

"మొదులు సెదుద్ది వుండమ్మోవ్" అన్నాడు ఎంకాయి.

"ఇప్పటికి వుపాచన కాకుంటే ఇగ తెల్లారుద్ది" అంది ఎంకటాం.

"హుఁ" అన్నాడు ఎర్రాయి.

"ఎట్టా?" అన్నాడు ఎంకాయి.

"కల్లు దిరుగుతుండై" అంది ఎంకటాం.

"మంది యదవ జల్మము!" అనేశాడు ఎర్రాయి.

"మెల్లిగా అంటావేం?" అన్నాడు ఎంకాయి.

"సెనేశరబ్బతుకు!" అంది ఎంకటాం.

తుబుక్కున వూసి, అట్టనే పొందుకుండాడు ఎర్రాయి, కదుప్మీన సెయ్యేసుకుంటా.

కూసేపయింది....

"ఎంకటాం?" అన్నాడు ఎంకాయి సల్లగా.

"ఏందిరా?" అంది ఎంకటాం.

"ఆకలయితుందదా?" అన్నాడు ఎంకాయి.

"నీకో?" అంది ఎంకటాం.

"రగుల్తుందది."

"నాకూ రగుల్తుందది."

"ఎప్పుడూ మనిద్దరం వొకటేనే."

"అటనే బాగుంటది.'

"మనంగూడా పొందుకుందామా?"

"వూ!."

'మీన సెయ్యేయి."

"అమ్మో యాడా!"

"ఎర్రాయి అటుదిరిగి పొందుకుండాళ్ళే."

అసువంటప్పుడు మద్సులకి జీవాలు ఎటుపొమ్మంటే అటు లెగిసి పోతయి.

పక్కన మురుగ్గుంటలో కప్పోటి గోడమీనకి గెంతేసి పడింది.

మొండితోక నల్లకుక్క వొచ్చింది. పెళ్ళోరిగేటు కల్లి మోరెత్తి గాలి బీల్సింది. వొచ్చి ఎర్రాయి ఎంకాయి ఎంకటావుఁల్ని వోకంట సూసింది తబ, తబ వొల్లుగోక్కునీ ఎటో లగెత్తింది, గెంట అవలే దనుకుంటా.

పొడుగాంటి మడిసి యిగ్రహం-పెళ్ళోరింటిపక్క తలుపు తెర్సుకుని బెయిటకొచ్చింది.

ఆడ సీకటిమయం.

నుప్పుల్ల ఎలిగిచ్చింది యిగ్రహం చిగిరెట్టు ఎలిగియను-ఏందసి? ఆడ ఏందో కన్నుకు సూటిగా తగిలింది యిగ్రహానికి, మల్లీ నుప్పుల్ల ఎలిగింది - పైట తొలిగి పడుండ ఎంకటాం వొల్లు తలుక్కుమం దాడ.

వొల్లు జలబరిచ్చింది యిగ్రహానికి.

బంగారం వుండదాడ. రతనా లుండయ్యాడ. సొరగం వుండ దాడ.

యిగ్రహానికి మైకం కమ్మింది. రఖతం కాగింది యిగ్రహానికి. లోన ఏందో పచ్చికి మల్లే రెక్కలాడిచ్చింది యిగ్రహానికి - అటనే వొరిగింది యిగ్రహం ఎంకటాం పైట తొలిగినకాడికి-

తబీ తబీ మంది ఏందో-

"అబ్బా" అ నరుత్తా యీపున సెయ్యేసుకుని బూమ్మీన పడివుంది యిగ్రహం రఖతం గక్కుతా.

"ఓమ్మో!" అని మూలిగింది ఎంకటాం, లెగిసి పయిట సరుదుకుంటా.

"యదవా!" అన్నాడు ఎర్రాయి, గెడకుమల్లే నిలబడి బుసలిడుత్తా.

"గోయిందా" అనరిశారు బోజనాలకాడ పెల్లిజనం.

"బాబో-సచ్చాంరా లగెత్తంద్రా లగెత్తంద్రా, బెయిటి కొత్తుందారూ-" అనరిసింది ఎంకటాం, ఎర్రాయినీ, లెగిసి బిత్తరసూపులు సూత్తుండ ఎంకాయినీ సేతులు పట్టుకుని లగెత్తుకా.

ఆడ పులిత్రాకులు లెగిసణ్ణాయి కూసేపుటికి.